గమ్యస్థానం

శ్రీ ఆర్. ఎం. చిదంబరం

నిశ్శబ్దంగా ఆవులిస్తున్న ప్రకృతి—అనురాగంలో చంపల్ని చల్లగా ముద్దుపెట్టుకుంటున్న పిల్లగాలుల చేష్టలకు కోపంతో మందలిస్తూ కొద్దిగా కదలుతూన్నవి తాటిచెట్లు...నలువైపులనుండి ఎదుర్కొంటున్న మేఘాలధాటికి ఆగలేక సూర్యుడు మస్య మస్య తెరను చీల్చి బయటకు తొంగిచూస్తూ, అంతలోనే అదృశ్యమవుతూ దోబూచులాడుతున్నాడు. విశాఖపట్నంనుండి రావలసిన పార్సిలు పాసెంజరు రెండు గంటలు లేటని ఎవరో అనేవరకూ నాకు తెలియలేదంటే, ఆ గంభీరప్రకృతిలో వున్న ఆకర్షణే అయుండాలి. ఉదయం ఎనిమిదిగంటలకే రెండెడ్ల బండితో స్టేషను చేరుకున్నాను. కాని రైలు పదిన్నర దాకా రాదు.

ప్రతిక్షణం ఓ యుగంలా వుంది. గడియారంవంక చూస్తే అది ఆరుగంటలకే కాళ్ళు బారచాపి సుషుప్తిలో మునిగిపోయింది. 'కీ' యివ్వటం మరచివుంటాను. 'జీవితంలో ప్రతివస్తువూ ఇంతేనా?' అనిపించింది. అవసరానికి ఏవీ ఆదుకోవు. ఆ వుదయం ఉత్తరం పోస్టుచేద్దామని వెళ్ళేసరికి ఒక్క నిమిషం క్రితమే టపా తీసినట్లు తెలిసింది. అంతే—ప్రతి అవకాశం ఒక్కక్షణంలో తప్పిపోతుంది. 'అయ్యో! అడుగులు త్వరగా వేస్తే ఎంత బాగుండేది!' అనిపించింది. వివేకమనేది పొరపాటు చేశాక కాని కలుగదన్నాడు ఆస్కార్ వైల్డ్—నిజమే ననిపించింది. రైలుపట్టాలు పొడవుగా కదలిపోతున్నాయి. విభిన్న ఆదిర్శాలకు మల్లే ఎక్కడా కలుసుకోకుండా, ఏదో రహస్యాన్ని చెవిలో వూదుతున్నట్టు భ్రమపెట్టాయి. రెండు సమాంతరేఖలు అనంతంలో కలుసుకుంటాయని గణితశాస్త్రం చెబుతుంది. "అనంతమనేది ఎక్కడుంది? అదేదో కనిపించనంతవరకూ ఈ సిద్ధాంతాన్ని ఎందుకు నమ్మాలి?" అనెవరూ అడుగలేదనని ఓ క్షణం వాపోయినమాట వాస్తవం.

ప్లాటుఫారంమీద ఆ చివరనుండి ఈ చివరకు పచార్లుచేయ నారంభించాను. ఇద్దరు ముగ్గురు ప్రయాణికులు తప్పించి మరెవరూ లేరు. అందులో ఒకతను నిశ్చింతగా వదలుతున్న చుట్టపొగ, మేఘాలతో ఆడుకోటానికి పయన మవుతోంది. ఇంతకూ ప్రకాశం వస్తాడో రాడో! 'అటు సూర్యుడు ఇటు పొడిచినా నేను రావటం తథ్యం' అన్నాడు వుత్తరంలో. అతను రాకపోతే సూర్యుడు పశ్చిమంలో వుదయించాడనుకోవాలి. ఏవిటో! ఇలా అర్థంతీస్తే సామెతలు తెల్లమొహం వేస్తాయి. కాని, ప్రకాశం ఇలా ఎన్నిసార్లు రాయలేదు? మాట నిలబెట్టుకోవాలన్న పట్టింపు అతనికి ఏకోశానా లేదు. సామానంతా సర్దుకుని ప్రకాశం దూరప్రయాణానికి సిద్ధమై టాక్సీలో అడుగుపెట్టబోతున్నాడనుకోండి. ఎవరైనా మిత్రులువచ్చి 'ప్రకాశం! ఆలెక్ గినెస్ చిత్రం వచ్చింది. పద!' అంటే చాలు—ప్రయాణం సంగతి గతయుగంలోకి విసిరేసి సినిమాకు వెళ్ళిపోతాడు. నిలకడలేని అలాంటి మనిషిని నమ్మటమెలా?

బి. ఏ. చదవేటప్పుడు మా మిత్రబృందంలో ముగ్గురు ప్రధానవ్యక్తు లుండేవారు. మొదటివాడు ప్రకాశం—మాలో మాకు లక్షన్నర అభిప్రాయభేదాలు. ఒకరి అభిరుచులు మరొకరికి నచ్చవు. కాని కలిసిమెలిసి వుండేవాళ్ళం—జాగ్రత్తగా ఆలోచిస్తే ఈ విభిన్నాభిరుచులున్నవారే అన్యోన్యంగా, ఒకరినొకరు అర్థం చేసుకుని స్నేహంగా వుండగలరనుకుంటాను. ఒకే రకం మనస్తత్వాలున్న వ్యక్తులు ప్రతిదానికి అంగీకారంగా తలవూపేస్తారు. వాదనలకు—చర్చలకు తావుండదు. ఒకరి అభిప్రాయాన్ని మరొకరు ఎప్పుడు ఖండించి పారేద్దామా అన్న తహ తహ వుండదు. కేవలం వుప్పులేని కూరలా వుంటుంది. మా మైత్రి జీవితాంతంవరకూ రాయిలా నిలిచిపోతుందని అప్పట్లో వెర్రి కలలు కంటూ, స్నేహితాన్ని మరింత దృఢతరం చేసుకోటానికి ప్రయత్నించినా, కాలక్రమంలో తలో మూలకు విసిరివేయబడ్డాం. ముళ్ళపొదల్లా ఎదుర్కొనే సమస్యల్ని తప్పించుకు తిరిగే నేర్పరితనం వుంటేనే జీవితంలో కొన్నిసార్లైనా తృప్తిగా నవ్వుకోవచ్చు. జీవితం సృష్టించే తుఫాను

లకు ధైర్యంగా నిలబడేందుకు చేసే ప్రయత్నంలో, ఒకరికొకరు వుత్తరాలు రాయటంకూడా మానుకున్నాం.

ప్రకాశం తలిదండ్రులు విశాఖపట్నంలో వున్నారు. కాలేజీలో చదివేటప్పుడు చీకూ—చింతా లేకుండా కాలక్షేపం చేసేవాడు. హంసల్లా కదలిపోయే అమ్మాయిల అడుగుజాడలు (తారురోడ్డు కనక) వెదకటం అతని హాబీలలో ఒకటి. పరిస్థితులు శ్రీకృష్ణుడి చక్రాయుధంలాంటివి. మన కనుగుణంగా మార్చుకోవాలికాని చూసి జడుసుకోకూడదు. అదెలాగో మాత్రం చెప్పేవాడుకాడు. ప్రకాశం అందంగా వుంటాడు. "ఎలా?" అని ప్రశ్నిస్తే సమాధానం చెప్పటం కష్టమేమో! ఏ అమ్మాయైనా అతని సౌందర్యాన్ని వర్ణించవలసి వుంటుంది. ప్రకాశం తృప్తిగా నవ్వినప్పుడు అతనిముఖం మెర్క్యురీలైటు హఠాత్తుగా వెలిగినట్టు తళుక్కుమనడం నాకళ్ళకీనాటికీ కనిపిస్తోంది. సముద్రపులోతుల్ని దాచుకుని గంభీరంగా నవ్వేకళ్ళు—నాల్గురకాల శోకాలు కలిస్తే 'హాస్యం' వుద్భవిస్తుందని హబ్యాష్మ్స్ ప్రతిపాదించినట్టు, నాల్గురకాల వికారాలు కలిస్తే సౌందర్యం పుడుతుందిగామోలు! నుదుటిమీద జారిపడే జుత్తును అతనెన్నడూ వెనక్కి దువ్వుకోడు. ఆపని 'ఎదురుగాలి' చేస్తుందంటాడు—'హైరోడ్ క్రాపింగు' వున్నవారికి దువ్వుకునే బాధ లేదు గామోలు!

అలాంటి చక్కదనంతో ఎందరో అమ్మాయిల్ని ఆకర్షించి ఏడిపించుకుతిన్నాడు. అతని నైతిక జీవితంలో నల్లమచ్చలు చాలా వున్నాయని అందరూ విమర్శిస్తారుకాని నేనుమాత్రం నమ్మను—ఎవరూ రుజువు చెయ్యలేదు కనక. అతని అభిప్రాయాలు, ప్రవర్తన అన్నీ తర్కబద్ధమైన సిద్ధాంతాలమీద ఆధారపడి క్రమంగా వేళ్లు పాతుకుపోయాయి. వాటినెవరూ కదల్పలేరు—అభిప్రాయాలు ఏనాడూ స్థిరమైనవి కావు. కనక, రుజువు దొరకగానే మార్చుకుంటాను.

గంటకొట్టారు. కాళ్ళు నొప్పిపుట్టటంవలన పిచ్చివాడిలా అటూయిటూ చాలాసార్లు తిరిగివుంటానని గ్రహించాను. ఆశ్చర్యపోతూ స్టేషనుమాస్టరుగది దగ్గరకు వచ్చేసరికి తొమ్మిదీ ఇరవై అయింది. అనుకున్నప్రకారం బండి రెండుగంటలు లేటుకాదని, ముందుగానే వస్తోందని తెలుసుకునేలోగా బరువుగా నిట్టూరుస్తూ బండి వచ్చేసింది. ఇంజను దగ్గర్నుండి జాగ్రత్తగా వెతుక్కుంటూ వెళ్ళాను. ప్రకాశం సెకండుక్లాసు కంపార్టుమెంటునుండి దిగుతూ నాకేసి జేబురుమాలు వూపాడు. ఇద్దరం కలిసి సామాను దించాం.

"థాంక్స్!...అసలు నావుత్తరం నీటిమూటగా జమకట్టి, గాలిమూటగా విసిరేసి, ఇసికమూటలా ఇంటిదగ్గరే వుండిపోయావనుకున్నా." నవ్వుకోక తప్పింది కాదు.

బలిసినఎడ్లు వుత్సాహంతో పరుగులు తీస్తున్నాయి. బండి గతుకుల్లోపడ్డప్పుడుమాత్రం తల ఠప్పీమని వెదురుకర్రకు కొట్టుకుంటోంది. బండివాడు ఏదో పాట మొదలుపెట్టాడు. దూరంగా గొల్లకాపరులు పాడుతూన్న జానపదగీతాలు గాలిలో తేలుతూవచ్చి చెవులదగ్గర గిలిగింతలు పెట్టాయి. ఆ వాతావరణంలో ఏదో మహత్తరానందం అనుభవిస్తూ కళ్ళు మూసుకున్నా.

"అబ్బబ్బ!...మీవూరు ఇంత నాగరికంగా వుంటుందని ముందుగా తెలిస్తే అసలు రాకపోదును. ఇల్లు చేరుకునేసరికి నాపని సగం పూర్తయ్యేటట్టుంది" అని విసుక్కున్నాడు ప్రకాశం. అంతేమరి హాయిగా పట్టుపాన్పుమీద వెడుతున్నట్టు బస్సులో, ట్రాములో ప్రయాణం చేసిన వ్యక్తికి బాధగానే వుంటుంది.

"రమణా! నన్ను క్షమించాలి. నేను విశాఖపట్నం నుండి నిన్ను చూద్దామనే రాలేదు. కొంత స్వార్థం కూడా వుంది. మీవూరికి దగ్గరలో "దమ్మిడీపాలెం" అని మరో వూరుంది కదూ! అక్కడ మా మావయ్య వున్నాడు. అతనేదో పెళ్ళిసంబంధం చూసివుంచాడట. ఆ మొక్కుబడి చెల్లించుకురమ్మని అమ్మ, నాన్న పీక్కుతింటే పోరుపడలేక పనిలోపనని బయలుదేరాను. నా మంచిచెడ్డలు, అవసరాలు నాకు తెలుసు. ఈ మనుష్యులతో ఇదే పేచీ. వీళ్ళేమో పెళ్ళిళ్ళు చేసుకుని పిల్లల్ని కని ఏంచేయడానికీ తోచక ఆకాశంవంక చూస్తూ గుడ్లు తేలేస్తున్నారు. అంతటితో తృప్తిపడరు-ఇతరులుమాత్రం ఎందుకు సుఖంగా వుండాలని నిద్రాహారాలులేకుండా, ఆ వలలో పడేవరకూ, వేపుకు తింటారు."

"అయితే బాబయ్యా! బండి దమ్మిడీపాలేనికి మళ్లించమంటారా? అడ్డదోవంట సులువుగా ఎళ్లొచ్చు" అన్నాడు బండివాడు.

ప్రకాశం కళ్ళు ఓమాటు నవ్వి, వెంటనే కోపగించుకున్నాయి.

"రవణా! వట్టిబ్రూట్స్! అచ్చ తెలుగులో చెప్పినా అర్థం చేసుకోలేరు." బండివాడు సమాధానం కోసం ఎదురుచూడకుండా తిరిగి తన పాటలో మునిగి పోయాడు. ఊరు చేరుకోటానికి ఇంకా గంట ప్రయాణం చెయ్యాలి. ప్రకాశం 'మౌత్ ఆర్గన్' తీసి సరికొత్త హిందీ సినిమా పాటను పలికించసాగాడు. బండివాడు తనపాట ఆపుకున్నాడు. పాతకూ కొత్తకూ పోరాటం కావచ్చు—గెలిచేది ఏదో కాలక్రమంలో కాని తెలియదు. దూరంగా దమ్మిడీ కాలవ నిండిపారుతోంది. వురకలు వేస్తూ ఎర్రటినీరు ఏమహత్తర కార్యాచరణకోసం పరుగులుతీస్తోందో మరి! గట్లమీది మొక్కలు దాని వుద్వేగం చూసి గజగజ వణకుతూ ఒకదాని చెవిలో మరొకటి ఏదో రహస్యంగా చెప్పుకుంటున్నాయి. ప్రకృతి పలికే రహస్యం మానవులకు అర్థంకాదుకనక ఆలోచనలు ఆగిపోయాయి.

"బాబయ్యా! నీకు లేకపోతే బండి కాలవ దాటేస్తది. ఇప్పుడు లాభంలేదు. ఎడంసేతి వేపు మళ్లించి చుట్టుదోవంట తోలతాను." అంటూ జాగ్రత్తగా మళ్ళించబోయాడు. ఒచక్రం సగంవరకూ బురదలో దిగబడిపోయింది. ఆ బురదను తప్పించాలన్న అతని ప్రయత్నం విఫలమైంది.

ముగ్గురం దిగాం—చక్రాన్ని బయటకు తీయటానికి శాయశక్తులా ప్రయత్నించాం కాని ప్రయోజనం లేకపోయింది. కాలవమాత్రం మమ్మల్ని చూసి పెద్దగా నవ్వింది. ప్రకృతిశక్తులతో పోరాడి ఎవరూ గెలవలేరని దాని సారాంశం కావచ్చు.

"ఒట్టి జర్మన్‌ఫారెస్ట్!...ఇలాంటి ప్రదేశంలో నువ్వెల్లా వుండగలుగుతున్నావో నాకు తెలియదు. ఇదే టౌన్‌అయితే మరో టాక్సీలో పోవచ్చు. ఇంకా చూస్తావే? సామానులు నెత్తిమీద పెట్టు."

ప్రకాశం కోపంతో వణకిపోతున్నాడు. అతనికి జరిగిన స్వాగతానికి నొచ్చుకున్నాను. ఏం చేయటానికి తోచక వెనక్కి తిరిగి చూసేసరికి గట్టుమ్మట నడిచి పోతున్న ఇద్దరు కుర్రాళ్ళు కనిపించారు. గుర్తుపట్టి చప్పట్లు చరచి పిలిచాను.

ఇద్దరూ పరుగెత్తుకొచ్చి "నమస్కారం మేష్టారూ" అన్నారు నవ్వుతూ. వాళ్లకేసి జాలిగా చూసేసరికి పరిస్థితి నర్థంచేసుకుని బండివాడితో కలిసి చక్రానికి విముక్తి కలిగించారు. భుజబలంతోపాటు బుద్ధిబలంకూడా అవసర మనుకున్నాను.

"మేష్టారూ! రేపు జామెట్రీయేనాండి తెచ్చుకోవలసింది? నిన్న మేం స్కూలుకు రాలేదు" అన్నారు. అవునని తలూపాను. బండి కదిలింది.

"ఎవర్రా వాళ్ళిద్దరూ?...నీ విద్యార్థులనుకుంటా—పాపం! వినయగుణసంపన్నులు—విశ్వాసపాత్రులు అని నువ్వు వర్ణించవచ్చు. నేనుమాత్రం అడవిజంతువులంటాను. పిలవగానే పరుగెత్తుకొచ్చారు. బొంబాయి కాన్వెంటులో నేనూ ఓ ఏడాది మేష్టరుగా వున్నా. ఎంత రిఫైన్డ్‌గా వుండేవారు! ఇలాంటి పనులకు పిలిస్తే వీపు పగలేస్తారు" ప్రకాశం కళ్ళు గర్వంతో కదిలాయి.

"ప్రకాశం! ఇంతవరకూ నీ అభిప్రాయాన్ని ఖండించకూడదని వూరుకున్నాను. నీ అభిప్రాయాలు నేను మార్చలేనని తెలుసు. ఈ ఒక్క విషయంలో మాత్రం మౌనంగా వుండలేను. మనిషిక్కావలసింది ఒక్క నాగరికతే కాదు; మానవత్వంకూడా అవసరం—మానవత్వం అంటే ఏమిటని అడుగు చెప్తాను; నా వుద్దేశంలో ఎదుటివాడు కష్టపడుతుంటే, అర్థంచేసుకుని నీకు చేతనైనట్టు సాయంచేయి. అప్పుడు నీక్కలిగే తృప్తి, ఆత్మవికాసం ప్రపంచానికి సర్వాధికారివైనా కలగదు. అలా ప్రతివాడు చేయగలిగితే ద్వేషం—అహంకారం—కుళ్ళు—కుట్ర—ఇవేవీ ఉండవు. మానవులు ఒకర్నొకరు ప్రేమించుకుంటారు. అర్థం లేని ఈ 'డిగ్నిటీ' నాకక్కర్లేదు. ఆ విద్యార్థులు చూట్టానికి నాజూగ్గా లేకపోవచ్చు. కాని ప్రతిఫలం ఆశించకుండా సాయం చేయలేదూ?" అన్నాను వుద్రేకంతో.

హృదయంనుండి వెలువడే సత్యాన్ని ఎవరూ ఎదిరించలేరు. ప్రకాశం నా మనస్థితిని అర్థంచేసుకుని వూరుకున్నాడు. పావుగంటవరకూ ఎవరూ మాట్లాడ లేదు.

"బాబయ్యా!...ఆముందరెడుతున్న అమ్మాయిని సూడండి—పాపం!...కాళ్లకు ముల్లు, రాళ్లు గుచ్చుకుంటున్నాయిగామోలు! అలవాటు లేదు గామోలు! పట్నపోసపోళ్ళు" అంటూ సగం వెక్కిరింతగా, సగం జాలిగా బండివాడనేసరికి ఇద్దరం అటు చూశాం. అతను చెప్పింది నిజమే! చేతిలో ఎర్రటి శాండల్సు వున్నాయి—కావిడి మనిషి ముందు సామానుతీసికెడుతున్నాడు. గలగల మువ్వలచప్పుడు విని ఆమెకూడా వెనక్కి తిరిగి చూసింది.

"రవణా చంపావ్!...అది విజయభారతి! ఇక్కడి కెందు కొచ్చింది చెప్మా...నాతో అక్షరం ముక్కయినా చెప్పలేదే?"

ఆశ్చర్యంలో మునిగిపోయాను — మా మిత్ర బృందంలో రెండో వ్యక్తి భారతి. బండి ఆగేలోగా ప్రకాశం క్రిందకు దూకి "భారతీ!" అంటూ ఆమెను ఆపివేశాడు.

"నడచి బాధపడింది చాలు—సాహసం చేయక బండెక్కు—మన రవణకూడా లోపలున్నాడు."

భారతి నమస్కరించి బండిలో కూర్చుంది. ఆమె సామానంతా ముందుకు సర్దాను.

"నేను వస్తున్నట్టు వుత్తరం రాశాను. బండి పంపమన్నాను. ఆ వుత్తరం పెదనాన్నకు అందిందో లేదో మరి!" అంది భారతి.

"ఇలాంటి పల్లెటూళ్ళోవున్న మనుష్యులకు కనీసం ఒకదాని వెనక ఒకటిగా అరడజను టెలిగ్రాములివ్వాలి." అని ఎత్తిపొడిచాడు ప్రకాశం—ప్రయాణాల్లో వుండే కష్టాల్ని గురించి అతనేదో చెప్పబోయాడు. నేను మాత్రం ఆ సంభాషణకు దూరంగా వుండి భారతిని గురించి ఆలోచించ సాగాను.

ఆమెకు 'షేక్స్‌పియర్' స్వాగతమంటే తగని పిచ్చి. అతని నాటకాలు, వ్యాఖ్యానాలు, విమర్శలు కలుపుకుని ఆమె షెల్ఫులో కనీసం వంద పుస్తకాలైనా వుంటాయి. ఎరుపు రంగంటే భారతి కిష్టమన్న సంగతి జ్ఞప్తికొచ్చి ఆమెవంక చూశాను. పొడుగ్గా వున్న జడచివర ఎర్రరిబ్బను కట్టి వదిలేసింది. లేత గులాబీ రంగుచీర. ఎర్రటి పువ్వుల క్రేప్ జాకెట్టు— ఎర్రరాళ్ళవుంగరం — కళ్ళజోడు ఫ్రేంమీద కూడా ఆ చివరనుండి, ఈ చివరదాకా ఎర్రగీత పొడుగ్గా సాగిపోయింది. అంతా అరుణమయం ప్రకాశం, భారతి ఎంతో సన్నిహితంగా వుండటానికి వాళ్ళ అభిరుచులు వేరుకావటమేనని నేను వాదిస్తూ వచ్చినా ఎవరూ నమ్మేవారుకారు. 'అతను చిటికెన వేలుమీద ఆడించిన అమ్మాయిల్లో ఆమెకూడా ఒకతె' అన్నారు మిత్రులు.

"ఏమండోయ్! మీ యింటికి రావటం లేదని కోపమా? మీ రిక్కడుంటున్నట్టు ప్రకాశం నాతో ఎప్పుడూ చెప్పలేదు." రెండు చుక్కల తేనె చిలికినట్టు నవ్వింది. కళ్ళజోడు తీసి తుడుస్తుంటే ముఖం అమాయకంగా కనపడింది. ఒక్క కళ్ళజోడు మనిషి రూపాన్ని ఎలా మార్చగలుగుతుందో మాత్రం నా కర్థం కాలేదు. భారతి మళ్ళా కళ్ళజోడు పెట్టుకు నేసరికి నిజానికీ, అబద్ధానికీ మధ్యవున్న వ్యత్యాసం బోధపడింది. భారతి తండ్రి గవర్నమెంటు ఆఫీసరు— ప్రస్తుతం అందరూ బొంబాయిలో వున్నారు. ఆమె లిటరేచర్ ఎం. ఎ. చదువుతోంది. ప్రకాశం పనిచేసే కార్యాలయం యూనివర్సిటీకి దగ్గరగా వుంది కనక ఇద్దరూ అప్పుడప్పుడు కలుసుకుంటూ వుంటారట—

"అదేం కాదు భారతీ! ఏవో పాతజ్ఞాపకాలు వచ్చి" అని ఆపేశాను.

"ఓల్డ్ ఈజ్ గోల్డ్" అన్నాడు ప్రకాశం.

పదకొండుగంటలకు ఇల్లు చేరుకున్నాం.

అమ్మ, చెల్లాయి మా కోసం ఎదురు చూస్తూ అరుగు మీదే కూర్చునివున్నారు. మాతోపాటు భారతి కూడా బండి దిగేసరికి కొంచెం ఆశ్చర్యపడక తప్పింది కాదు.

* * *

ప్రకాశం స్నానంచేసి, గ్లాస్కో పంచె గోచీ పోసి కట్టుకుని, పల్చటి లాల్చీ తొడుక్కున్నాడు. అతని అంద చందాలు కొట్టొచ్చినట్టు కనిపించాయి. భారతికూడా ముస్తాబై చివరిసారిగా మరికొంచెం 'యార్డ్‌లీ' పౌడరు ముఖానికి అద్దుకుంది. ఇల్లంతా చూపించాను. చాలాచోట్ల మరమ్మతు చేయాలని భారతి హెచ్చరించింది. ఆ ఇల్లు పీకిపారేసి రేడియో ఫాషన్‌లో ఓ బంగాళా కట్టాలన్నాడు ప్రకాశం. హాల్లో నాలుగుకుర్చీలు, టేబిలు వేశాను. ఎప్పుడో కొన్న టేబిలు క్లాతు పెట్టె అడుగునుండి తీశాను.

చెల్లాయి ఉప్మా, కాఫీ తీసుకొచ్చింది. కాఫీ గ్లాసులో పోస్తుంటే చెయ్యి వణికింది గామోలు! అంతా నేలపాలైంది. చెల్లాయి జాలిగా చూసింది.

"బాగా నే వుందమ్మాయ్! నీ మొగుడిమీదకూడా ఇలా కాఫీ ఒలకబోశావంటే ఆ దవడ, ఈ దవడ వాయించేస్తాడు," అంది భారతి మందలింపుగా. ఆమె అమాయకత్వానికి నవ్వుకున్నాను. భారతికి జీవితానుభవం లేదు. భర్తల మనస్తత్వంగురించి ఆమె చేసే వూహాగానాలు సత్యానికి ఎంతో దూరంలో వుంటాయి. ఇంతటి చిన్నపొరపాటుకు ఏ మగవాడూ చెయ్యిచేసుకోడు. ఆమె దృష్టిలో భర్తలు రాక్షసులు- పెళ్ళాం చేసే ప్రతిపనినీ జాగ్రత్తగా పరిశీలించి, విమ

ర్శించి, శిక్షించే సి. ఐ. డి. లు. చెల్లాయి సిగ్గుపడుతూ ఆమె కెదురుగా కూర్చుంది.

"అయితే రమణా! నీ భావిజీవితం మాటేమిటి?" అనడిగాడు ప్రకాశం ఎటో చూస్తూ—ముఖంలోకి చూస్తూ అత నెన్నడూ మాట్లాడడు.

"అది ఆయన జాతకంలో రాసి వుంటుంది లేక పోతే నుదుటిమీ దుంటుంది. అంతే కాని ముందెలా తెలుస్తుంది?" అని భారతి అడ్డుపడింది.

"అదేం ప్రశ్న? నాజీవితం ఏనాడో స్థిరపడి పోయింది," అన్నాను. ప్రకాశం పెద్దగా నవ్వాడు—అందులో వున్న వెక్కిరింత ఆ శబ్దంలో ప్రతి అణువులోనూ ప్రతిధ్వనించింది.

"అంతే నంటావా? ప్రపంచానికి, నాగరకతకు దూరంగా, ఓమూల కుగ్రామంలో బడిపంతులుగా స్థిరపడటమే నన్నమాట నీజీవితలక్ష్యం! ఛీ!...ఉన్నత స్థితికి రావాలన్న ఆకాంక్ష లేదూ నీకు? చేతిలో నయా పైస వుంచుకుని దానితో కలకాలం తృప్తిగా బతకవచ్చనుకోటం తెలివితక్కువ కాదూ? ... నీది చచ్చు ఫిలాసఫీ! ఏమంటావ్ భారతీ?" అన్నాడు గోడమీది బల్లి కేసి చూస్తూ—

"నా సంగతి అలావుంచు—ముందు నువ్వే ఘన కార్యం చేయదల్చుకున్నావో చెప్పు—వినాలని కుతూహలంగా వుంది!" అన్నాను.

ప్రకాశం మిగిలిన కాఫీని ఒక్క గుటకలో మింగేసి పెద్ద చప్పుడు చేస్తూ గ్లాసు టేబిలుమీదుంచి మొదలుపెట్టాడు.

"అలా అడుగు. చెప్తాను...ఏదీ సాధించకుండా బతకటం నీచమానవుడి లక్షణం. నేను చెప్పే మాటలు నీకు రుచించక పోవచ్చు. ఆ భావన నువ్వు బహిర్గతం చేయకపోయినా, నేను అర్థంచేసుకోగలను. నూటికి అరవై మంది ఆశించేదల్లా సామాన్యజీవితం. నిత్యావసరాలు గడచిపోటానికి ఏదో ఇంత రాబడి. మరీసుందరి కాని భార్య. అపురూప సుందరైతే ఎవరైనా ఎత్తుకుపోవచ్చు...రక్షించుకునే సమర్థత లేదు కనక—సంసారపక్షానికిచెందిన స్త్రీ. సంఘంలో గౌరవం. అంటే, తింటూ, తిరుగుతూ పిల్లల్ని కని పారేసి ముసలితనంలో వాళ్ళనూ, వీళ్ళనూ యాచిస్తూ కాలం గడిపి కన్నుమూయటం. ఆ తరువాత నలుగురూ 'ఆహా! ఆయన కేమండి! నలుగురు కొడుకులు! ఏకాదశినాడు పోయాడు. సరాసరి స్వర్గం చేరుకుంటాడు. అని మెచ్చుకుంటారు. అది కాదు. జీవితానికర్థం. మనం చనిపోయాక కూడా నలుగురూ జ్ఞాపకం వుంచుకోవాలి. అందువలన మన కొరిగే దేమిటని మాత్రం అడుగకు. సమాధానం చెప్పలేను. అదో బలత్తరమైన వాంఛలాంటిది. దానికి అర్థాలు, కారణాలు, భూతభవిష్యత్తులు—ఏవీ లేవు. నాలో యౌవనం, బలం వుంది. ప్రపంచాన్ని నా శక్తితో వుర్రూత లూగిస్తాను. ఏదో వొకరంగంలో అందని నక్షత్రంలా మెరసిపోతాను, అదే నాకోరిక, ఆశయం - అప్పటివరకూ నేను జీవించి వుంటాను!"

ఆశయాలకూ, ఆచరణకూ మధ్యవున్న వ్యత్యాసాన్ని గురించి ఆలోచిస్తూ భారతివంక చూశాను.

"ప్రకాశం చెప్పింది అక్షరాలానిజం—అందరికి మల్లే వుండదల్చుకుంటే, నాన్నగారి మెప్పుకోసమైనా పెళ్ళిచేసుకునేవాన్ని—అసలు నాకు వివాహంలో నమ్మకంలేదు. వ్యక్తిత్వాన్ని, స్వేచ్ఛను అమ్ముకోటం—అందుకే, ముందుగా నే పథకం వేసుకున్నా. ఎం. ఎ. పూర్తికాగానే ఏ కాలేజీలోనైనా లెక్చరరుగా చేరి సాహిత్యరంగంలో కృషిచేసి..."

"నోబెల్ బహుమానం అందుకుంటావు, షేక్స్‌పియర్ రచనలు అతని స్వంతం కావని సోదాహరణంగా రుజువుచేస్తావు. అంతేనా?" అని నవ్వేశాను. భారతి నొచ్చుకుని ముఖం చిన్నబుచ్చుకుంది.

"కాదు. మాకు ఆత్మవిశ్వాసం వుంది. అవకాశాలూ వున్నాయి. అనుకున్నవన్నీ సాధిస్తాం" అని ప్రకాశం ఆమెను బలపరిచాడు.

"భారతీ! అవన్నీ పగటికలలని నాకు తెలుసు. మీరుకూడా ముమ్ముందు గ్రహిస్తారు: ఆశావాదులుగా వుండటం తప్పననూ. కాని అందుకు అవధులు నిర్ణయించటం అత్యవసరం. వాస్తవికతను ఎదుర్కొనేవరకూ నేనూ ఎన్నో అనుకున్నాను. ఐ. ఎ. ఎస్. ఆఫీసర్ని కావటమా? కాలేజీ ప్రొఫెసరుగా రాణించటమా? రాజకీయవేత్తగా ప్రసిద్ధిపొందటమా?... కోరికలకు అంతులేదు. కాని సాధించగలిగానా? నేను వూహిస్తూ కూర్చున్నాను కాని ప్రయత్నించలేదని మీరు ఆరోపించవచ్చు. అది మాత్రం నేను ఒప్పుకోను—దూరంనుండి చూస్తుంటే అన్నీ తళుక్కుమని మెరుస్తూ, ఆశల్ని రేపుతూ రమ్మని పిలుస్తాయి. దగ్గిరకు వెడితే అన్నీ గాజుపెంకులు—మోసపోతావు. జీవితంలో రహస్యమే ఇది. పూర్తిగా ఓడి

పోయేవరకూ ఈ రహస్యం తెలిసిరాదు...అంతేకాదు. మనభవిష్యత్తు మన చేతిలో లేదు. పైనుండి నడిపించేవాడొకడున్నాడన్న సంగతి మరచిపోకు..."

"ఎవడాపైన వున్నవాడు?" అని గద్దించాడు ప్రకాశం. సరిగ్గా అదే సమయానికి అమ్మ దేవుడిపటం ముందు మల్లెపూలుంచి నమస్కరించింది. ఆ పని ఉదయం చేయవలసింది. పనితొందరలో మర్చిపోయింది గామోలు! చెల్లాయిముఖంలో భయం లతలా అల్లుకుపోయింది.

"కంటి కెదురుగా వచ్చి కనపడమను—నా ప్రశ్నలకు జవాబులిమ్మను. ఇంత లాజిక్ చదువుకున్న నువ్వుకూడా దీన్ని నమ్ముతున్నావా? మంచీ, చెడ్డా—అన్నింటినీ కలిపి, పాపం, ఆ నోరులేని దేవుడి నెత్తిమీద రుద్దటం–ఏదో ఏదో చేసేయటం—'అంతా వాడి చిద్విలాసం!' అనటం—డామిట్! అలా అర్థంకాని భాషలో, సగం మనసుతో దేవుణ్ణి పూజించేదానికంటె అరడజను సిగరెట్లు ఎక్కువ కాల్చటం మేలు" అంటూ చెప్పుకోపోయాడు.

"మనం ఆరాధించవలసింది అచేతన వస్తువుల్ని కాదు. కళను ఆరాధించు. చిత్రపటాలు గీయి. పద్యాలు రాయి. వేల్లుసహితం తలవూచేట్టు సంగీతం పాడు. హృదయాన్ని పులకరింపచేసే నృత్యంచేయి. అదే జీవితం—మోక్షం. శాంతి—సృష్టి—అన్నీ!"

నేనేం జవాబు చెప్పక భారతి వంకచూశాను. సర్వశక్తిసంపన్నుడైన భగవంతుడు ఏమీ అనలేక మూగవాడిలా వూరుకున్నాడేమని గామోలు చెల్లాయి నోరు తెరచి ఆశ్చర్యంతో వింటోంది.

ఇదంతా వింటున్నట్టు దూరంగా, అసంతృప్తితో ఆకాశం గర్జించింది. గుండె జల్లుమంది. దమ్మిడీకాలవ గట్లు తెంచుకుని ఏక్షణంలోనైనా ఉరకటానికి సిద్ధంగావుంది. మళ్ళీవర్షం కురిస్తే నిప్పుకు గాలితోడైనట్టవుతుంది.

"భోజనానికి లేవండి! తరువాత వాదించుకోవచ్చు." అంది అమ్మ. ప్రకాశం వుత్సాహంతో టేబిలుమీదకు వంగి ప్రశ్నించాడు.

"చూడండి పిన్నిగారూ! మీ యబ్బాయినిలా పల్లెటూళ్ళో గోళ్ళు గిల్లుకుంటూ కూర్చోనివ్వక నాతో పంపండి. రాజాలాంటి వుద్యోగంలో చేర్పించి అభివృద్ధిలోకి తీసుకు వస్తాను."

"ఏమోనాయనా! ఎవరి అదృష్టం ఎలావుందో. అంతా విధి లిఖితం! దిక్కూ మొక్కూ లేకుండా వందల కొలది మైళ్ళదూరంలో వాడూ—ఇక్కడ నేనూ! ఎలా జరుగుతుంది? ఏదో యిలా కలిసి మెలిసి కలో గంజో తాగుతూవుంటే చాలు. తృప్తి అనేది మనకుండాలి కాని..."

పెద్ద వుపన్యాసం యివ్వటానికి సిద్ధపడ్డవాడిలా ప్రకాశం కనుబొమ లెగరేశాడుకాని, పానకంలో పుడకలా సంగీతం మేష్టారు ప్రవేశించారు.

"మేష్టారూ!...ఈ వేళ మా యిల్లంతా స్నేహితులతో కలకల్లాడుతూంది. ఈవేళ్టికి పాఠం మానుకుందాం" అన్నాను.

"అయితే మేష్టారూ! అమ్మాయిని చూసుకోటానికి ఎల్లుండేకదూ వస్తానన్నారు? వాళ్ళ నాను గ్యా పొద్దున్న కనిపించాడు. అబ్బాయి ఇవేళ వస్తాడట—ఏముందిలెండి. ఆ మూడుముళ్లుపడ్డాక సంగీతానికి ఫుల్ స్టాప్ — అమ్మాయికంఠం మధురమైంది — ఆమె కెవర్ని రాసిపెట్టిందో మరి. అమ్మాయిని సంగీతసరస్వతిగా మార్చవచ్చు. సెలవు" అంటూ ఆయన వెళ్ళిపోయాడు.

"ఈ రాసిపెట్టటం ప్రతివారినోటంట వినిపిస్తోంది. భూతద్దం తీసుకుని ఎవరైనా పరీక్షిస్తే బాగుండును" అంది భారతి.

"మీరిద్దరూ ఒకర్నొకరు 'మేష్టారూ' అని సంబోధించుకోటం వినటానికెంతో యింపుగావుంది." అని ఎత్తిపొడిచాడు ప్రకాశం.

భారతి చదువుతున్న పుస్తకాన్ని బల్లమీదుంచి "ఏదీ! ఒక్కపాటపాడు!" అంది చెల్లాయి నుద్దేశించి.

చెల్లాయి సిగ్గుపడి "అంత బాగా పాడలేనండి." అంది. ఆమె సిగ్గుపడుతుంటే చేమంతిపువ్వు అందానికి, గులాబీపువ్వు అందం తోడైందని గామోలు ప్రకాశం ఓ క్షణం రెప్పవాల్చకుండాచూసి "పరిపూర్ణజ్ఞానం వున్నవారెవరూ తాము గొప్పవాళ్ళమని చెప్పుకోరు. అదో ఆచారం. అంచాత పాడి తీరాల్సిందే! లేకపోతే ఇంటికొచ్చిన అతిథుల్ని అవమానం చేసినట్టవుతుంది." అన్నాడు కోపం నటిస్తూ.

నేను నవ్వటం అంగీకారంగా తీసుకుని "ఎలా నీ దయరాదు?" అఠాణాలో పాడింది. ప్రకాశం, కీర్తన ముగిసేవరకూ కాల్పనిక జగత్తులో రెక్కలు విచ్చిన విహంగంలా ఎగురుతూ, రసోత్పత్తిక్రమంలో

అలలుగా తేలుతూ, సంగీతంలోవుండే అణువుల్ని చీల్చి అనుభవించాడని అతని ముఖభావనల్ని బట్టే గ్రహించాను.

"మీరు చేస్తున్నది పొరపాటు. రెండుమూడేళ్లు సాధకం చేస్తే మీ చెల్లాయి నక్షత్రంలా మెరిసి పోతుంది. ఆమెకు పెళ్లి చేసి సంసారకూపంలో త్రోయ కండి. నేర్చుకున్నంతమాత్రాన వచ్చేదికాదు సంగీతం. ఆ అదృష్టం కొందరికే వుంటుంది. ఎన్నోసార్లు నేర్చు కోవాలని ప్రయత్నించి ఓడిపోయాను. ఆ అనుభవం మర్చిపోలేను." అంది వుద్రేకంలో భారతి.

చెల్లాయి నాకేసి దీనంగా చూసింది. నేను మాత్రం ఏం చేయగలను? భోజనాలయ్యాక అమ్మ రహస్యంగా నన్ను వంటింట్లోకి పిలిచింది.

"చూడు! ఆ యబ్బాయి ఊరు, పేరు, కులం, గోత్రం అన్నీ కనుక్కొని వుంచు. తెలివైనవాడు—మాట్లాడానికి మహారాజులా వున్నాడు. వీలవుతే అమ్మా యికి చూద్దాం."

ఆశ్చర్యంతో చెల్లాయికేసి చూశాను. వంటింటో ఏదో పనిచేస్తున్నట్లు నటిస్తూ ఓరకంటితో నాకేసి చూసింది. నాకర్థమైంది.

తల్లీ కూతురూ కలిసి వేసుకున్న పథకమన్న మాట—అమ్మకు ప్రకాశం పుట్టుపూర్వోత్తరాలేవీ తెలియవు. రెండుగంటల కాలంలో అతన్ని అల్లుడిగా చేసుకోవాలన్న కోర్కె వుదయించింది! అతని వాక్చాతుర్యం—అందచందాలు ఆకర్షించివుంటాయి. దేవుని వునికిమీద పరిపూర్ణ విశ్వాసంవున్న అమ్మ నాస్తికప్రచారం చేస్తున్న ప్రకాశాన్ని ఎలా మెచ్చు కుందన్న ప్రశ్నకుమాత్రం జవాబు దొరకలేదు. వయసు ముదిరినవాళ్ళకు కొన్ని విచిత్రమైన అభిప్రాయా లుంటాయి. ప్రకాశంవంటి యువకులు ప్రతిపాదించే సిద్ధాంతాలు కేవలం తాత్కాలికమైనవని అమ్మ అభి ప్రాయం కావచ్చు. లేక చెల్లాయి అతని మనసు మార్చ గలుగుతుందన్న దృఢనిశ్చయం కావచ్చు. ఏదెలా వున్నా ఒక్కవిషయంమాత్రం నిజం—ప్రకాశం ఎంత ఆవేశంతో, కచ్చితంగా మాట్లాడినా అందులో వున్న నిజాన్ని ఎవరూ గుర్తించరు, 'వెర్రివాగుడు' క్రింద జమకట్టి వూరుకుంటారు.

"అయితే మరి ఎల్లుండి దమ్మిడీపాలెంనుండి వస్తు న్నారుకదా? దానిమాట?"

"అదెలాగో ఒకలాగ తప్పించేద్దాం—ఈ అవకా శాన్ని మాత్రం వదులుకోకు." అని హెచ్చరించింది. నవ్వుకుంటూ అరుగుమీది కొచ్చాను.

ఆకాశం మబ్బుల ముసుగు కప్పుకుంది. అంతు లేని నిరాశలా చీకటి ఆవరించింది. మెరుపులు—ఉరు ములు—కన్న సంతానాన్ని పోగొట్టుకున్న తల్లిలా వూగిసలాడుతున్న చెట్లు—దూరంగా కోలవచేస్తున్న భయంకరధ్వని. దాని వుత్సాహం క్షణక్షణానికీ అధిక మవుతూంది. కిటికీలన్నీ మూసేశాం.

"నేను వర్షంమూలంగా ఇక్కడ ఆగినట్టు మామయ్యకు కబురంపితే బాగుండును." అన్నాడు ప్రకాశం.

"ఈ వానలో ఆ వూరెవరూ వెళ్ళరు—గట్లన్నీ జారతాయి." అన్నాను. కుంభపోతగా వర్షం కురవ సాగింది.

"ఎల్లుండి కూడా ఇలా వర్షం కురిస్తే అసలు పెళ్లిచూపులకు రానేరారు." అంది అమ్మ.

"సరే మంచిది. ఆ బెడద కాస్తా వదులుతుంది." అని వూరడించాడు ప్రకాశం. ఎవరో తలుపుతట్టారు. చెల్లాయి తలుపు తీసేసరికి పెద్దసంచీ మోసుకుంటూ ఆచారి లోపల అడుగుపెట్టాడు.

"అరెరె!...నువ్వా?...భలే! భలే! మిత్ర త్రయం మళ్ళీ కలుసుకున్నాం."అని అరిచింది చప్పట్లు చరుస్తూ భారతి.

మా మిత్రబృందంలో మూడోవ్యక్తి రంగా చారి. నాటికీ, నేటికీ అతనిలో మార్పులేదు. ఆచారికి మొండిపట్టుదల ఎక్కువ—ఎందరు ఆక్షేపించినాసరే, ఆచార ప్రకారం పిలక వుంచుకున్నాడు. నుదుటిమీద కొట్టొచ్చేట్టు నామాలుండేవి. చాలామంది విద్యార్థులు అతన్ని అసహ్యించుకున్నారు. అతనిమీద నాకు మాత్రం ప్రత్యేకగౌరవం వుండేది. అడవిజంతువుల మధ్య ఏకాకిగా నిలబడ్డ అతని మనస్థైర్యాన్ని అభినం దించాను. ఆధ్యాత్మికచింతకు మనసే ప్రధానంకాదు—బాహ్యచిహ్నాలుకూడా అవసరం—ఇది ఆచారి వాదన—వర్షంలో బాగా తడిశాడు—గడ్డం అస హ్యంగా పెరిగింది. ప్రకాశానికి అలాంటి వాళ్ళను చూస్తే అరికాలిమంట.

"అర్ధణా కో బ్లేడు వస్తుంటే గీకి పారేయ కూడదూ?" అంటాడు. రంగాచారి ఏదోకంపెనీలో గుమాస్తాగా వున్నాడు. అత్తవారిల్లు మా వూరికి దగ్గర

లోనేవుంది. అప్పుడప్పుడు వస్తుంటాడు. మా యింట్లో అతన్ని బాగా తెలుసు.

"అయ్యో! పూర్తిగా తడిసి ముద్దైపోయావు. బట్టలు మార్చుకో—అమ్మాయ్! కాఫీ తీసుకురావే!" అని తొందర పెట్టింది అమ్మ.

"రవణా! ఆ సంచీలో పళ్ళున్నాయి. తీసి లోపలవుంచు." అన్నాడు. అతని ఆప్యాయతను హృదయంలో ఏమూల దాచుకుంటే భద్రంగా వుంటుందో తెలిసిందికాదు. ప్రకాశం కోరికమీద ఈ ఐదారేళ్ళలో ఆచారి జీవితంలో కలిగిన మార్పులు వివరించాను.

"బాగుందిరా! నీతమ్ముడే! ఇద్దర్నీ పోలిస్తే నువ్వే కొంతనయం! ఆచారి పూర్తిగా అడవిజంతువై పోయాడు!" అని విమర్శించాడు. మాధ్యాహ్నికం పూర్తిచేసికాని భోజనానికి రానని ఆచారనేసరికి, ప్రకాశం, భారతి గొల్లుమన్నారు.

*　　　　*　　　　*

రాత్రి ఎనిమిది—

మదించిన ఏనుగులా బయట ప్రకృతి ఘీంకరించి ఎవరిమీదో—ఎందుకో—అకారణంగా పగ సాధిస్తోంది. చెట్లన్నీ వేళ్ళతోసహా శూన్యంలోకి ఎగిరిపోయేట్టు వుద్ధృతంగా వీచే గాలి. దానివేగాన్ని ఆధునిక యంత్రాలు నిర్ణయించవలసివస్తే, అవికూడా ఎగిరెగిరి కొండలు, గుట్టలూ దాటి అదృశ్యమవుతాయి. ప్రకృతి ఒక్కసారిగా విజృంభిస్తే ఎవరూ ఎదుర్కోలేరు. ఎత్తు పల్లాలను సరిచేస్తూ, అడ్డంకుల్ని భూమిలో అణచివేస్తూ చెలరేగుతుంది. రాత్రిభోజనా లయ్యాక కవుడిపటంముందు నిలబడి ఏ ఆపదా రాకుండా వుండాలని నమస్కరించాను.

"ఏవిటిదంతా?" అనడిగాడు ప్రకాశం.

"కాదు ప్రకాశం! ఇది పరీక్షాసమయం! ఈ వర్షాలు మంచికోసం రాలేదు. ప్రజల్ని ఏడిపించుకు తినటానికే. బతక నివ్వదు; చావనివ్వదు." అతనికి నామాటలు బోధపడలే దనుకుంటాను. పేకాడుకుందికి రమ్మన్నాడు. మనసంతా చీకటితో నిండిపోయింది. దమ్మిడీ కాలవ ద్విగుణీకృతమైన ఉత్సాహంతో ఎగిరి పడుతోంది. చీకట్లో చూడలేకపోయినా, అదిచేసే భయంకరధ్వని, అట్టడుగున దాచుకున్న రహస్యాన్ని, బట్టబయలు చేసింది. ఇంట్లోంచి వీధిలోకి, వీధిలోంచి ఇంటోకి కాలుకాలిన పిల్లిలా ఎన్నిసార్లు నడిచివుంటానో తెలియదు. ప్రకాశం, భారతి పేక్లు ఆడుదుని విసుగెత్తి మానుకున్నారు. రంగాచారికి దగ్గూ, జ్వరం వచ్చింది. నా దగ్గరున్నమాత్ర లేవో ఇచ్చాను. అమ్మ మిరియాలకషాయం కాచి ఇచ్చింది.

"అన్నయ్యా! ఎంతసేపు ఇలా తిరుగుతావు? కాళ్ళు నొప్పి పెట్టవూ?" అని చెల్లాయి బాధపడింది.

ప్రకాశం పడుకు నేందుకు మేడెక్కాడు.

"ప్రకాశం! ఇది ఇక్ష్వాకులనాటి యిల్లు—ఒంటరిగా మేడమీ దెందుకు పడుకోటం?" అని అడ్డుపడ్డాను. అతను నిర్లక్ష్యంగా నవ్వేసి వెళ్ళిపోయాడు.

రాత్రి పన్నెండుగంటలకు మెలకువ వచ్చింది. కళ్ళు తెరచిచూశాను. అందరూ నిద్రపోతున్నారు. మనసంతా ఆందోళనతో నిండిపోయింది. లేచి కూర్చున్నాను. ఎవరో తలుపుతడుతున్న చప్పుడు. మొదట భ్రమేమో ననుకున్నాను. రెండోసారి కొంచెం గట్టిగా వినిపించేసరికి వెళ్ళి తలుపు తీశాను. చీకట్లో ఏమీ కనిపించక టార్చిలైటు వేశాను.

"నేనండి! సీతారాముణ్ణి బాబయ్యా! కాలవగట్టు తెగి గూడెంలోకి వచ్చేసింది. అందరం సత్తున్నాం. తమరు ఎంటనే రావాలి." అన్నాడు గజగజవణుకుతూ. వాడి వంటిమీద చిన్నతువ్వాలు తప్పించి, గుడ్డముక్క లేదు. కళ్ళు ఎర్రగా వున్నాయి. చిన్న చింకిచాప నెత్తిమీద గొడుగులా వుంచుకున్నాడు. అదతన్ని రక్షిస్తుంది గామోలు—అతన్ని చూడగానే గట్టిగా ఏడవా లనిపించింది. నా ఒక్కడివలన అయ్యేదేమీ లేదు. సీతారాముణ్ణి ఇంటోకి రమ్మని తలుపు వేశాను. ప్రకాశాన్ని లేపుదామని మేడమీదకు వెళ్ళాను.

అతను గురకపెట్టి నిద్రపోతున్నాడు. తియ్యటి కలలు కంటున్నాడుగామోలు! గబ గబ మేడమెట్లు దిగివచ్చి, గొడుగు, చేతికర్ర తీసుకున్నాను. భారతి కళ్ళు నలుపుకుంటూ లేచింది. సీతారాముడికి ఓపాత దుప్పటిచ్చాను. రంగాచారి మేల్కొన్నాడు. అమ్మ, చెల్లాయి భయం గూడుకట్టుకున్న కళ్ళతో అర్థరహితంగా చూస్తున్నారు. ప్రకాశం మేడదిగి వచ్చాడు. అందరికి పరిస్థితి అర్థమైంది.

"ప్రకాశం! నువ్వుకూడా వస్తే ఎంతో బాగుంటుంది! బయలుదేరు." అన్నాను. అతను ఎగిరిగంతు లేస్తూ, తన ఆశయసిద్ధికి అవకాశం లభించినందుకు

సంబరంతో వస్తాడనుకున్నాను. కాని ఆ నమ్మిక ఒక్క క్షణం మాత్రమే నిల్చింది.

"సారీ! రమణా! నీళ్ళకూ, నాకూ అసలు పడదు. అయినా ఈపాటికందరూ సురక్షితప్రదేశానికి చేరుకునే వుంటారు. మనం వెళ్ళి చేసేదేమీ వుండదు. ఆ ప్రవాహానికి ఎదురీదలేం—"

అగ్నిపర్వతం బద్దలై, ఎన్ని అగ్ని కణాలు రాలుతాయో, అన్ని మాటలందామనుకున్నాను. కాని అవధులుదాటిన వుద్రేకం నన్ను మాట్లాడనివ్వలేదు. మొదటిసారిగా ప్రకాశంమీద వెగటు కలిగింది. ఎందుకో, అతను వెంటనే వెళ్ళిపోతే బాగుండునని పించింది.

రంగాచారి మూలుగుతూ లేచి దుప్పటికప్పుకుని "మరో గొడుగు వుందా?" అనడిగాడు.

"ఎందుకు!" అనడిగాను ఆశ్చర్యపోతూ—అతను ప్రశ్నకు సూటిగా సమాధానం చెప్పకుండా, గదంతా, పరీక్షగా చూసి గోడమూలనున్న గొడుగు తీసుకుని "పద" అన్నాడు.

"ఆచారీ! నీకేమైనా మతిపోయిందా? ఈ వానలో తడిస్తే ఏమవుతుందో తెలుసా? ఏ నిమోనియా అయినా వస్తే?"

"చస్తాను. అంతేనా? నా బాధ్యత నాకు తెలుసు. ఆలస్యం చేయకు." అన్నాడు. అతని తత్వం నాకు బాగా తెలుసు—ఏదన్నా చేయవలసివస్తే వెర్రి ఆవేశంతో మొదలు పెడతాడు.

ముగ్గురం బయలుదేరాం.

"చూడు భారతీ! మానవజాతి క్షేమంకోసం సర్వస్వమూ ధారపోసే వుత్తములు" అన్న ప్రకాశం మాటలు చెవులదగ్గర్నుంచి దూసుకుపోయాయి.

మేం వెళ్ళేసరికి నీరు మోకాలుదాకా వచ్చేసింది. అందరూ గగ్గోలుపడుతూ హాహాకారాలు చేస్తున్నారు. చలినుండి రక్షించుకోటానికి ఎలాంటి ఆధారమూ లేదు. వాళ్ళకున్న ఆ స్తిపాస్తులు—కుండలు—సీమ వెండిగిన్నెలు—అన్నీ స్వాతంత్ర్యం ప్రకటించి ప్రవాహంతో కలిసిపోయాయి. ఊళ్ళో పెద్దలు కొంతమంది వచ్చారు. అందరం కలిసి ఆ జనాన్ని మెరక ప్రదేశానికి చేర్చాం—హైస్కూలు గదులన్నీ తెరచి అందులో వుండటానికి తగిన ఏర్పాట్లు చేశాం—ఈ అనుభవం కొత్తదికాదు. అయిదారేళ్ళకితం దమ్మిడీ కాలవ ఇలాగే విజృంభించి, తనలో అంతర్గతమైవున్న శక్తిని చూపించింది. మరోగంటలో ఆ గుడిసెలన్నీ సగంవరకూ నీటిలో మునిగిపోయాయి. క్రితంసారి ఈ విషాదసంభవం జరిగినప్పుడు అందరం కలిసి, మున్ముందు ఇలాంటి ఆపదలు రాకుండా వుండేందుకు ఏదైనా చర్య తీసుకోమని ప్రభుత్వానికి అర్జీ పంపుకున్నాం. కాని బ్రహ్మాండమైన ప్రణాళికలతో సతమతమవుతూన్న ప్రభుత్వానికి ఇలాంటి అల్పవిషయాలు గమనించడానికి తీరికవుండకపోవచ్చు—సగం దారిలో ఆచారి కళ్లుతిరిగి పడిపోతే సీతారాముడు అతన్ని భుజంమీద మోసుకొచ్చాడు.

ఇల్లు చేరుకునేసరికి మూడుగంటలైంది. ప్రకాశం నిద్రపోతున్నాడో లేదో చూద్దామని మేడమెట్లుదాకా వెళ్లి తిరిగి వచ్చేశాను. ఆచారి ఎవరికీ నిద్రాభంగం కలగకుండా వుండేందుకు మూలుగును అణచిపెట్టటానికి యత్నించాడు.

ఎప్పుడు నిద్రపోయానో తెలియదు.

ఏదో బ్రహ్మాండమైన చప్పుడు—ఆ వెనువెంటనే దిక్కుల్ని చీలుస్తూ ఆర్తనాదం పెనుగాలిలా, నిశ్శబ్దాన్ని వణికిస్తూ వ్యాపించింది. ఉలిక్కిపడి మంచంమీదనుండి క్రిందకురికాను. వంటిమీదంతా జల్లుపడుతోంది. అందరూ మేలుకున్నారు.

"అన్నయ్యా!" అనరిచింది చెల్లాయి మేడవంక వేలెట్టి చూపిస్తూ—అవును... మేడ కూలిపోయింది. అయ్యో! ప్రకాశం?...

ఓ నిమిషం ఏం తోచలేదు—రంగాచారి గబగబ మెట్లెక్కాడు. ఆ గదినిండా మట్టిబెడ్డలూ, పెంకులూ, వాసాలూ—అందరం కలిసి ఆ శిథిలాల మధ్య నరకబాధ ననుభవిస్తున్న ప్రకాశాన్ని బయటకు తీసుకువచ్చాం. ఆ దృశ్యం గుండెల్ని చీల్చివేసింది. సీతారాముడు అతని పక్కనే కూర్చున్నాడు. చీకటిని, వర్షాన్ని లెక్కచేయకుండా డాక్టర్ని తీసుకువచ్చాను—ఆయన కట్లు కట్టాడు. ఇంజక్షనిచ్చాడు. కాని ఎంతకూ ఆగని రక్తప్రవాహం! ఆశయాలతో, ఆదర్శాలతో, అందనిపండును అందుకోవాలన్న ఆకాంక్షతో పొంగిపొరలుతూన్న ఆ యువకరక్తం దారి కనపడగానే బయట కురుకుతోందిగామోలు! ప్రకాశం కళ్లు తెరచి అందరివేపూ చూశాడు.

"రమణా! మేడమీద పడుకోవద్దని ముందే చెప్పావు—విన్నాను కాను—అబ్బ!...మరణ బాధ

ఎంత క్రూరమైందీ?...పాపం! వాళ్ళుకూడా ఇలాగే బాధపడివుండాలి; అటు చూడు! నేను బతికాలని గామోలు ఆచారి ఏవో మంత్రాలు చదువుతున్నాడు! వెర్రిమనుష్యులు—నే నిలాగే చచ్చిపోతాను—నా కోరికలు నన్ను సమాధిచేసి కడసారి గానం చేస్తాయి."

"అలాగనకండి బాబయ్యా!...చివరి కేమీ అవదు. అంతా నయమవుతుంది." అన్నాడు సీతారాముడు... అంతేకాదు. సీతారాముడు ప్రకాశంకోసం ఏడుస్తున్నాడు!!

"రవణా! ఓ సంగతి చెప్తాను. విన్నాక ఆశ్చర్య పోతావు. మొదట్లో అనుకోలేదుకాని, ఇక్కడికొచ్చాక నిన్ను వొప్పించి నీ చెల్లెల్ని పెళ్ళిచేసుకుందా మనుకున్నాను సుమా!..."

ఆ తరువాత అతను మాట్లాడలేదు. ఉదయం ఐదుగంటలకు వెర్రిగా నవ్వి కన్నుమూశాడు. ఆపుకుందా మనుకున్నా కన్నీరు ఆగలేదు. టెలిగ్రాం ఇద్దామంటే అతని తలిదండ్రుల ఎడ్రసు తెలీదు. భారతి పర్సులోంచి ఎడ్రసు తీసిచ్చింది. సీతారాముణ్ణి ఎలాగైనా టౌనుకు వెళ్ళి టెలిగ్రాం యిమ్మని పంపాను.

ప్రకాశం ముఖం ఇంకా ప్రపంచం వేపు ఆశగా చూస్తోంది. ఎన్నో పథకాలు వేసుకున్నాడు. అవన్నీ ఆచరణలో పెట్టే శక్తి సామర్థ్యాలున్నాయి. కాని జీవితం అతన్ని మోసగించింది. "అమ్మో! అతను గొప్పవాడైపోతాడు. నే నెలా సహించగలను?" అన్న అసూయతో, సిగ్గుతో తలెత్తుతూన్న మొక్కను మొదలంట తుంచివేసి వికటాట్టహాసం చేసింది. ఏ ఆశయాలూ లేకుండా, కుక్కిన పేనులావున్న నాబోటివ్యక్తుల్ని అదేం చేయదు.

"వాడో వెర్రివాడు! పోనిద్దూ!" అంటుంది గామోలు! అవును మరి—మాంసాహారికి బలిసిన శరీరం కావాలికాని కుక్క శరీరం దేనికి?

ప్రకాశం మృతశరీరంతో దమ్మిడీ పాలెం చేరుకునేసరికి పదకొండుగంటలైంది. పావుగంట ప్రయాసపడి అతని యిల్లు కనుక్కునేసరికి శరీరంలో ప్రతి అణువూ గజగజ వణికిపోయింది.

ప్రకాశం తమ్ముడు సంగతి తెలుసుకున్నాడు. అంతే—రోదనలు—ఆవేశాలు—శాపనార్థాలు.

భారతి తన ఇంటికి వెడుతూ "నా అభిప్రాయాలు కొన్ని మార్చుకుంటున్నా—పొరపాటుగా, అసందర్భంగా మాట్లాడాను—క్షమించండి" అంది. అదంతా విని జీర్ణించుకునే పరిస్థితిలో నేను లేను.

ఇంటికి తిరిగొచ్చి స్నానం చేశాను. అమ్మ భోజనానికి రమ్మంటే ఆకలి లేదన్నాను. రంగాచారి గోడ కానుకుని కూర్చున్నాడు.

"అమ్మా!" అని పిలిచాను.

"ఏం నాయనా?" అంది దిగులుగా. చెల్లాయి కూడా అక్కడే వుంది.

"ప్రకాశం ఎవరో తెలుసా? ఎల్లుండి చెల్లాయిని చూసుకోటానికి రావలసిన పెళ్ళికొడుకు. అతని మామయ్య పేరు మనం అడగలేదు. ఇంతకూ విధి లిఖితం!"

అమ్మ జవాబు చెప్పలేదు.

గోడమీదున్న దేవుడి పటానికి నమస్కరిస్తూ "నిన్ను నమ్మి చెడినవారు లేరు రామచంద్రమూర్తీ!" అంది గద్గదకంఠంతో.

చెల్లాయి నాకేసి భయంభయంగా చూసింది. ఆచారి ఓమారు దగ్గి విషాదంగా నవ్వుకున్నాడు. సీతారాముడు టౌనునుండి తిరిగివచ్చి మోకాలుమీద తల ఆన్చి కూర్చున్నాడు—అతన్ని చూసి అనుకున్నాను:

"సహృదయుంకల ప్రతిమనిషి దైవంతో సమానమైనవాడు."